క్లుప్తంగా

ఉపాధ్యాయులకు నియామకపత్రాలు

సాలూరు: ఎంటీఎస్ ప్రాతిపదికన 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఎస్‌జీటీలుగా ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో మండలంలోని 28 మందికి ఎంఈఓ రాజ్‌కుమార్ నియామకపత్రాలు గురువారం అందజేశారు. పట్టణంలోని రామాకాలనీ భవిత కేంద్రం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చక్కని విద్యాబోధన చేయాలని నూతన ఉపాధ్యాయులకు సూచించారు.

అంబేడ్కర్ అందరివాడు



అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ

పార్వతీపురంటౌన్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ అన్నారు. ఈమేరకు అంబేడ్కర్ 132 వ జయంతి సందర్భంగా గురువారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని కొనియాడారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మన్యం జిల్లా నాయకులు ఎం.రత్న కుమార్, డి.చంద్రమౌళి, గంట చంద్రమౌళి, ఫరూక్, ఎన్జీఓ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంగంవలస రహదారి పరిశీలన



రహదారి నిర్మాణంపై ఆరాతీస్తున్న పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: మండలంలోని సంగంవలస నుంచి సీతంపేట వరకు నిర్మిస్తున్న బీటీ రహదారిని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ గురువారం పరిశీలించారు. పనుల నాణ్యతతో జరగాలని ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వర రావు, డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పరిశీలన



బాగువలసలో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

సాలూరు: మండలంలోని బాగువలసలో జరుగుతున్న భూముల రీసర్వేను ఆర్డీఓ హేమలత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రీ సర్వే, రాళ్లు పాతడం, తదితర అంశాలపై ఆరా తీశారు. అవసరమైతే మరింత మంది కూలీలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.

వేగవంతంగా సరిహద్దు రాళ్ల ఏర్పాటు

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా సమగ్ర భూసర్వే ప్రాప్తికి భూ సరిహద్దు రాళ్ల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం రుద్రిపేట గ్రామంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్ శరత్‌కుమార్, వీఆర్వో బి.చిన్నందొర, దుర్గాప్రసాద్‌ల నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ నెలాఖరు నాటికి మండల పరిధిలో రాళ్ల ఏర్పాటు పూర్తి చేయటం జరుగుతుందన్నారు. జిల్లా ఏరువాక సలహామండలి సభ్యులు కండాపు ప్రసాదరావు, వలంటీరు ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమానికి సహకరించారు.

నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ

పాలకొండ రూరల్: వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వటం చట్టరీత్యా నేరమని పాలకొండ సీఐ మురళీధర్ అన్నారు. శ్రీకాకుళం రహదారి, వైఎస్సార్ కూడలి వద్ద వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. అధికలోడు, మితిమీరిన వేగంతో వస్తున్న వాహనాలతో పాటు సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి అపరాధ రుసుం విధించారు. ఆయన వెంట ఎస్‌ఐ బి.శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

జగనన్న పాలనలోనే..

ఆనందంగా ప్రజలు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పాలనలోనే రాష్ట్ర ప్రజలంతా ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని చినబొండపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని వారికి మన వైఎఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్ జగన్ గారి నాలుగేళ్ల లనలో చేకూరిన లబ్ధి, ప్రజలు పొందిన ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వంలో ప్రజలు మోసపోయిన వైనాన్ని, మోసగించిన విధానాన్ని అర్థమయ్యేలా రెండు ప్రభుత్వాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించడంతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గొప్పతనం తెలియజేశారు.

గ్రామస్తులతో సెల్ఫీలు

అలాగే మెగా పీపుల్ సర్వేలో భాగంగా ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరిచిన ఐదు ప్రశ్నలను నేరుగా అడిగి అవును అని సమాధానం చెప్పినట్లయితే బుక్‌లో టిక్ మార్క్ పెట్టిన వారికి రసీదులు అందించారు. మా భవిష్యత్తు,మా పిల్లల భవిష్యత్తు జగనన్నతోనే సాధ్యం అని మా నమ్మకం నువ్వే జగన్ అంటూ గ్రామస్తులు మద్దతు తెలపగా వారి ఇంటి డోరుపై జగనన్నే మా భవిష్యత్తు అనే స్టికర్‌ను, ఫోన్‌పై స్టిక్కర్‌ను అతికించి వారితో కలిసి ఫోటో దిగారు. సీఎం జగన్ పాలనపై నమ్మకం ఉంచి భవిష్యత్తులో కూడా మళ్లీ ఆయన పాలనే కావాలని, రావాలని ప్రజలు అంతా విశ్వసించడంతో పాటుగా ప్రభుత్వానికి మద్దతుగా వారి ఫోన్ల ద్వారా మిస్డ్ కాల్స్ ఇచ్చి కుటుంబాలు పూర్తి స్థాయి మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథ రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్ గండి శంకరరావు, ఎంపీటీసీ బంకురు రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వి గరురాజు, బి సత్యనారాయణ మూర్తి, మిరియాల కామేష్, బి మన్మథరావు, పోలినాయుడు, మర్రాపు వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



అభిప్రాయాన్ని సేకరిస్తున్న ఎమ్మెల్యే



స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే



బలిజిపేట: చాకరాపల్లిలో ఇంటింటికీ తిరుగుతున్న కన్వీనర్లు, గృహసారథులు

సీతానగరంలో...

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వారంరోజులుగా నిర్వహిస్తున్న న్న 'జగనన్నే మా భవిష్యత్తు' మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలు పండగ వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఈ మేరకు గురువారం పణుకుపేటలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్తున్న సమయంలో ప్రజల్లో జగనన్న ప్రభుత్వం పట్ల రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు బ్యాగ్‌లో వేసుకుని, చేతిలో ప్లకార్డులు పట్టుకుని ఆనందోత్సాహాలతో మెగా పీపుల్స్ సర్వే నిర్వహిస్తున్నారు. అలాగే సీతానగరం, పెదభోగిలి, ఎస్ఎస్ పురం, తదితర గ్రామాల్లో పీపుల్స్ సర్వే జరిగింది.

బలిజిపేటలో...

బలిజిపేట: మండలంలోని వివిధ గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించిన క్రమంలో పి.చాకరాపల్లిలో సర్పంచ్ కె.మోహనరావు, కన్వీనర్లు, గృహసారథులు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన రావు మాట్లాడుతూ జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంతవరకు ఎవరు ప్రవేశపెట్టలేదన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం: పణుకుపేటలో ప్లకార్డులతో పీపుల్స్ సర్వే చేస్తున్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌ల నిర్వహణ ఉండాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్(బీఎండబ్ల్యూ) సిబ్బందికి అవగాహన కల్పించి ఆయా వ్యర్థాలను పసుపు, ఎరుపు, నలుపు, నీలం బిన్స్‌లో భద్రపరచి రెయిన్‌బో వారి వాహనం ద్వారా డిస్పోజ్ చేయడంపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సేవల వారీగా ఫీజు వివరాలు బయట ప్రదర్శించాలని చెప్పారు. ఫైర్ సేఫ్టీ యంత్రాలను పరిశీలించి తప్పనిసరిగా సేఫ్టీ నియమాలు పాటించాలన్నారు. మలేరియా, డెంగీ పాజిటివ్ కేసుల వివరాలు డీఎంహెచ్ఓకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీవై. డీఈఎంఓ వి.సన్యాసిరావు, సిబ్బంది శ్రీధర్, వాసు పాల్గొన్నారు.



ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు

చెత్త నుంచి సంపద తయారుచేయాలి

సీతానగరం: మండలంలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో సంపద తయారుచేసి పంచాయతీల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా పాలకులు చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన అంటిపేటలో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్తనుంచి సంపదతయారు) కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇళ్లలో నుంచి గ్రీన్ అంబాసిడర్ల ద్వారా సేకరించిన తడి,పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువు తయారీకి ఉపయోగించాలన్నారు. కేంద్రాల్లో నిర్మించిన షెడ్‌లలో వర్మీ కంపోస్టు తయారీకి అవసరమైన వనరులు కల్పించడం వల్ల ఎరువు తయారీకి వీలవుతుందన్నారు. అలాగే అన్నిగ్రామాల్లో చెత్తనుంచి సంపద తయారు చేయడానికి ఉన్న వనరులను పంచాయతీ పాలక వర్గాలు వినియోగించాలని కోరారు. గ్రామాల్లోని కాలువల్లో పేరుకుపోతున్న పూడికలను తీయించాలని, తీసిన చెత్తను దూరప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు, వలంటీర్లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

సేంద్రియ ఎరువులతో అధిక వ్యవసాయ ఉత్పత్తులు

గరుగుబిల్లి: చెత్త నుండి సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను తయారు చేయాలని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని సంతోషపురం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చెత్త నుండి ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డు పరిసరాల్లో మొక్కలను నాటారు. సేంద్రియ ఎరువును వినియోగించి ఆరోగ్యకరమైన పంటలను పండించేలా రైతులకు మరింత అవగాహన కల్పించాల్సి వుందన్నారు. ఆయనతో పాటు సిబ్బంది తదితరులు ఉన్నారు.

104 సంచార వైద్య కేంద్రం ద్వారా

నిరంతర వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ పరిధి ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలు మరింత చేరువవుతాయని డాక్టర్ ఆశాలత అన్నారు. ఈ మేరకు గురువారం వెంకటాపురం పంచాయతీ పరిధిలోని నీలకంఠాపురంలో 104 సంచార వైద్య కేంద్రం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి ఇంతవరకూ ఒకే 104 సంచార వైద్య వాహనం ఉండేదని దీంతో నిర్దేశించిన గ్రామాల్లో వైద్య సేవలు అందించేవారమన్నారు. అన్ని గ్రామాలకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంలో గ్రామాల్లోనే రోగులకు మెరుగైన ఉచితవైద్య సేవలందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పెదంకలం పీహెచ్‌సీ అదనంగా 104 వాహనాన్ని సమకూర్చిందన్నారు. దీంతో పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో 104 వైద్య కేంద్రం 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 73 రకాల మందులతో నిరంతర వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులు, బాలింతలు, గర్భిణులకు 104 వైద్యకేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి అవసరమైన మందులు ఇవ్వనున్నట్లు, అలాగే వ్యాధి తగ్గుముఖం పట్టినంత వరకూ వైద్యసిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ప్రైవేట్ వైద్యం కన్నా ప్రభుత్వ వైద్య సేవలు రోగులు నిరంతరం వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆర్.రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు వై.గోపాలనా యుడు, 104 సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ ఆశాలత

భూసారం గుర్తింపులో అవగాహన అవసరం



శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో భూసారాన్ని వ్యవసాయ సహాయకులు పరీక్షించి పంటలను ఎంపిక చేసి రైతుల్లో అవగాహన పెంచడానికి ముందుగా వ్యవసాయసహాయకులు శిక్షణ పొందాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. ఈ మేరకు గురువారం గుచ్చిమి గ్రామంలో సర్పంచ్ ఎం.శ్రీదేవి అధ్యక్షతన ఏఓ ఎస్.అవినాష్ గ్రామ వ్యవసాయ సహాయకులకు భూసార పరీక్షలు నిర్వహించడానికి మట్టి నమూనాలు ఏ విధంగా సేకరించాలనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మంచి దిగుబడులు సాధించడానికి వారి భూముల్లో భూసారపరీక్ష అత్యంత కీలకమైనదన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగుచేస్తేనే మంచి పంటదిగుబడులు సాధిస్తారని, అధికదిగుబడి పొందడంలో నేలస్వభావం, భూసారం కీలకమన్నారు. కార్యక్రమంలో అనుభజ్ఞులైన రైతులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ : పీఓ



స్టాల్స్ పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గిరిజనులు పండిస్తున్న అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో జీసీసీ, వైకేపీ సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఏ అటవీ ఉత్పత్తులు ఇక్కడ సేకరణ జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. వాటి క్రయవిక్రయాలపై చర్చించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ వీడీవీకేల అభివృద్ధికి జీసీసీ, వైకేపీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించొద్దన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

సర్వే రాళ్ల పరిశీలన

భామిని: మండలంలో జరుగుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(ఐఓఎస్) రామకృష్ణ, డీఐఓఎస్ కమలేంద్రప్రసాద్ గురువారం పరిశీలించారు. వడ్డంగి, పక్కుడుబద్ర, బొమ్మికలో జరుగుతున్న కొలత రాళ్లు పాతుడు పనులు పరిశీలించారు. సక్రమంగా సరిహద్దు రాళ్లు వేయాలన్నారు. వారి వెంట తహసీల్దార్ నీలాపు అప్పారావు, మండల సర్వేయరు తోట రామ్మోహనరావు, డీటీ ఎస్.రమేష్‌కుమార్, ఆర్ఐ ఎస్.రాంబాబు ఉన్నారు.

కొలువుదీరిన కొత్త గురువులు



ఉపాధ్యాయ నియామక ఉత్తర్వులను స్వీకరిస్తున్న ఎంఈఓ జి.సూరిదేముడు

సీతానగరం: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన వారంతా సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు విద్యాబోధన చేసి సేవలందించాలని ఎంఈఓ జి.సూరిదేముడు కోరారు. ఈ మేరకు 1998 డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు గురువారం స్థానిక మండలవిద్యావనరులకేంద్రంలో ఎంఈఓ జి. సూరిదేముడు ఆధ్వర్యంలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడానికి అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. సిరికి మహేశ్వరరావు (అనంతరాయుడుపేట), మూడడ్ల సత్యనారాయణ (కామందొరవలస), ఓఎల్ ప్రకాశ రావు (దయానిధిపురం), పెంట మోహనరావు (వెంకటాపురం ఎ), రావిపల్లి అప్పలనాయుడు (కాశీపేట), సీహెచ్ శ్రీనివాస రావు (వెన్నెలబుచ్చింపేట), రెడ్డి భాస్కరరావు (నీలకంఠాపురం), బలగ అప్పలనాయుడు (చిన్నారాయుడుపేట) ప్రాథమిక పాఠశాలల్లో విధులకు హాజరైనట్లు ఎంఈఓ వివరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వారంతా మాట్లాడాలని ఎంఈఓ కోరారు. ఈ మేరకు నియమితులైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ తామంతా విద్యాబోధనకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎంఈఓ జి.సూరిదేముడుకు నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులంతా బొకేలతో సమర్పించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పోల సత్యనారాయణ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

98డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు

బలిజిపేట: 98డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారికి ఎంఈఓ శ్రీనివాసరావు గురువారం పోస్టింగ్ ఆర్డర్లు అందించారు. మండలంలోని 7పాఠశాలల్లో 8పోస్టులు భర్తీ అయినట్లు ఈ సందర్భంగా ఎంఈఓ తెలిపారు. బర్లి యూపీ పాఠశాలలో 2, చెల్లెంపేట, జనార్దనపురం, వంజరంపేట, శివరాంపురం, బడేవలస, అజ్జాడ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలకు ఒక్కో పోస్టు భర్తీచేసినట్లు చెప్పారు. కొత్తగా విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. గురువారం పాఠశాలల్లో విధుల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట: ఎంఆర్‌సీలో ఆర్డర్లు అందుకున్న ఉపాధ్యాయులు

సర్పంచ్ పదవికి రాజీనామా



సీతానగరం: రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓకు అందజేస్తున్న సిరికి మహేశ్వరరావు

మండలంలోని అంటిపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ సిరికి మహేశ్వరరావు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, మండల పంచాయతీ విస్తరణ అధికారి కె.కుమారవర్మకు తెలియజేస్తూ గురువారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని అందుకున్న అనంతరం ఎంపీడీఓ ఎంఎల్ ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ అంటిపేట గ్రామ సర్పంచ్‌గా రెండు సంవత్సరాలు బాధ్యతల్లో ఉన్న సిరికి మహేశ్వర రావు ఉపాధ్యాయుడిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేసినట్లు తెలియజేశారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి



డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురంటౌన్: కొత్తగా విధుల్లో చేరనున్న 98–డీఎస్సీ అభ్యర్థులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక డీఈఓ కార్యాలయంలో అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల నాటి నిరీక్షణకు తెరపడిందని కావున మీరంతా విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పాఠశాల పరిధిలో జరుగుతున్న నాడు–నేడు పనులు వేగవంతం చేసేందుకు కృషిచేయాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, పర్యవేక్షణపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. పాఠశాలలకు నిర్దేశించిన సమయానికి క్రమం తప్పకుండా వెళ్లాలని, విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఓపెన్‌స్కూల్ జిల్లా సమన్వయకర్త చొక్కాపు శ్రీనివాసరావు, ఏడీఏలు రమాజ్యోతి, వెంకటేశ్వరరావు, ఎంఈఓ ప్రసాదరావు, 98–డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు అవసరం

బలిజిపేట: భూసార పరీక్షలు ఎంతో అవసరమని పార్వతీపురం ఏడీఏ వెంకటేష్ అన్నారు. ఈ మేరకు బలిజిపేటలో గురువారం భూసార పరీక్ష నిర్వహించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు భూసార స్థాయిని, దాని స్థితిని తెలియపరుస్తాయన్నారు. సేంద్రియ, కర్బన విలువలు, లవణస్థాయి, నత్రజని, బాస్వరం, పొటాష్ లభ్యతను పరీక్ష చేసి భూమికి అవసరమైన ఎరువులను భూసార పరీక్షా ఫలితాల కార్డ్‌ద్వారా తెలియచేయనున్నట్లు చెప్పారు. గత్తం పోగులు ఉన్నచోట, నీటి నిల్వలు, నీడ, అప్పుడే ఎరువులు వేసిన చోట మట్టి నమూనాలు తీయరాదని సూచించారు. పొలంలో పంటలేనిచోట వేసవిలో మట్టి నమూనాలు తీయాలని సూచించారు. ప్రతి రైతుభరోసా కేంద్రంలో మట్టి నమూనాలను సేకరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్, ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేటలో నిర్వహిస్తున్న భూసార పరీక్షలు

రాజన్నదొర వెంటే ఉంటాం ...

• స్పష్టం చేసిన గిరిజన గ్రామాల నాయకులు, ప్రజలు

సాలూరు: మాకు అన్నివిధాలుగా మేలు చేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర వెంటే తామంతా ఉంటామని సంపంగిపాడు, డెన్సరాయి పంచాయతీల నాయకులు వెలగ పండయ్య, బాబురావు, వీరయ్య, రమేష్, పండు, తదితరులు స్పష్టం చేశారు. మండలంలోని మరిపల్లిలో వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ, సంపంగిపాడు సర్పంచ్ చంద్రయ్య తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడని, ఆయనను పార్టీలోకి చేర్చుకోవద్దని స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల తర్వాత తాము రాజన్నకు చెప్పామన్నారు. అయితే అందరం కలిసి పనిచేస్తే పంచాయతీ అభివృద్ధి చెందుతుందని భావించిన రాజన్నదొర ఆయనను వైఎస్సార్‌సీపీలోకి తీసుకున్నారని చెప్పారు. అయినప్పటికీ నమ్మకద్రోహి అయిన చంద్రయ్య తిరిగి టీడీపీలో చేరాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి పీడిక రాజన్నదొర హయాంలో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. తామెప్పుడు జగనన్న, రాజన్నదొరతోనే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనివాసరావు, మువ్వల ఆదయ్య, పెంటయ్య, సుబ్బారావు, బీసు, బేతురు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

బాధితులకు అండగా 'పోస్టల్ హెల్పింగ్ హ్యాండ్స్'

పార్వతీపురంటౌన్: రాయగడ రోడ్డులో గల మార్కెట్ యార్డు సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబానికి పోస్టల్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అండగా నిలిచారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం అందజేశారు. పూర్తిగా కాలి బూడిదైన బడ్డీ కొట్టు, రిఫ్రిజిరేటర్‌తో సహా అందులోని సామగ్రి పరిస్థితిని చూసి పోస్టల్ సిబ్బంది చలించారు. స్థానిక తపాలా సిబ్బంది వారి మిత్రుల సహకారంతో ఏర్పడిన 'పోస్టల్ హెల్పింగ్ హ్యాండ్స్' తరపున సభ్యులందరూ బాధితులైన మండల శ్రీధర్, సత్యవతిలను గురువారం పరామర్శించారు. నిలువ నీడ లేకపోగా తిండికి కూడా ఇబ్బంది పడుతున్న వారి పరిస్థితి తెలుసుకుని తక్షణమే స్పందించి తపాలా శాఖ సహాయ సూపరిండెంట్ సూరకత్తుల శ్రీకర్ బాబు, సిబ్బంది చేతుల మీదుగా రూ.పది వేలు తమ వంతు సాయంగా అందజేశారు.



బాధితులకు సహాయం అందజేస్తున్న తపాలా సిబ్బంది